జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 3 | మార్చి | 2026 ◆ పేజీలు : 8

# సహజసిద్ధమైన రంగులతో హోళీ సంబరాలు జరుపుకోవాలి

- హోళీ వేడుకలు ప్రశాంత వాతావరణంలో ఇతరులకు ఇబ్బందులను కలిగించకుండా జరుపుకోవాలి
- బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు
- ప్రత్యేక బృందాలతో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు:: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు




2లో...

# ఇల్లందు ఏరియా... గుర్తుందా!




- నెలల తరబడి నిర్వహించని సమావేశాలు?
- స్థానిక అధికారుల తీరు పట్ల సర్వత్ర విమర్శలు?
- గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలతో జరిగే స్ట్రక్చర్ సమావేశాలకు మంగళం?
- కార్మికుల పట్ల కెఓసి పిఓ నోటి దురుసుతో దుర్భషలాడిన వైనం?
- ఆందోళనలో చేపట్టిన కార్మికులు, కార్మిక సంఘాలు
- డిప్యూటీ సీఎం, సీ అండ్ యండి దృష్టికి తీసుకెళ్ళనున్న కార్మిక సంఘాలు
- అధికారుల తీరు పట్ల ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం!
- స్ట్రక్చర్ సమావేశాలు కొనసాగించేనా!
- అధికారుల తీరు మారేనా!
- ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో!

5 లో..

సింగరేణి సంస్థకు పుట్టినిల్లయిన ఇల్లందు ఏరియా ప్రస్తుత అధికారులకు గుర్తుందా అనే అనుమానాలు కార్మికుల్లో ఉన్నాయి. ప్రతినెల యాజమాన్యం గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలతో జరపాల్సిన స్ట్రక్చర్ సమావేశాలకు మంగళం పాడిందని కార్మికులు గుసగుసలాడుకుంటున్నారు. గత 15 నెలల నుండి కేవలం 3 నుండి 4 సార్లు మాత్రమే గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలతో స్ట్రక్చర్ సమావేశం ఏర్పాటు చేసినట్లు పక్కా సమాచారం.

● ఇల్లందు, ప్రజాజ్యోతి



# గల్ఫ్ ఉద్రిక్తతలతో... ఆందోళన

- ఉపాధి కోసం గల్ఫ్ దేశాల్లో వందలాది మంది జిల్లా వాసులు
- యోగక్షేమాలపై కుటుంబాల ఆరా
- రంజాన్ వేళ ప్రయాణాలపై అనిశ్చితి
- విమాన సర్వీసుల రద్దుతో మరింత భయం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 2 (ప్రజా జ్యోతి): పశ్చిమ ఆసియా దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల్లో తీవ్ర ఆందోళనకు దారి తీశాయి. ముఖ్యంగా ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు అక్కడ ఉపాధి నిమిత్తం ఉన్న జిల్లా వాసుల కుటుంబాలను కలవరపెడుతున్నాయి. జిల్లాకు చెందిన వందలాది మంది సౌదీ అరేబియా, ఖతార్, దుబాయ్, అబుదాబీ, ఒమన్, మస్కట్, కువైట్, బహ్రెయిన్, ఇరాక్ తదితర దేశాలకు వలస వెళ్లి కొలువులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొందరు

మిగతా 2 లో...

# పేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే కోరం



2 లో...



2 లో..

# రంగుల కేళి..!

● ఇల్లందు, ప్రజాజ్యోతి



రంగుల పండగ రానే వచ్చింది. శిశిరను సాగనంపుతూ వసంతానికి ఆహ్వానించే సందర్భంలో వచ్చే హోలీ వేడుకకు సమయమైంది. ప్రకృతితో అనుబంధం పెనవేసుకున్న రంగుల కేళి హోలీ అడుకోవడానికి చిన్నా.. పెద్దా తేడా లేకుండా సిద్దమయ్యారు. నూతన నవధాన్యాలతో తయారు చేసిన వంటకాలను మత, మతారాలకు అలంకరిస్తారు. ఊరి పొలిమేర వరకు వాయిద్యాల మధ్య ఊరేగిస్తూ తీసుకెళ్తారు. సంస్కృతి సంప్రదాయ బద్దంగా భక్తి, శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి దహనం చేస్తారు...

- -మోదుగపూల వసన్తా హేళ
- -వసంతంలో తొలి పండుగ
- -వేడుకలకు సిద్ధమైన చిన్నా.. పెద్దా..
- -సహజ రంగులే మేలు - రసాయనాలతో హాని
- -నేడే హోలీ!

## సహజసిద్ధమైన రంగులతో హోళీ సంబరాలు జరుపుకోవాలి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ,మార్చి 2,ప్రజాజ్యోతి :** హోళీ పండుగ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుభాకాంక్షలు తెలిపుతూ హోళీ పండుగను సాంప్రదాయబద్ధంగా,పరస్పర గౌరవంతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ప్రజలను కోరారు.హోళీ వేడుకల సందర్భంగా సహజసిద్ధమైన రంగులను మాత్రమే ఉపయోగించాలని,హానికరమైన రసాయనిక రంగులను వాడకూడదని సూచించారు.ఇతరులకు ఇబ్బందులు కలిగించే విధంగా బలవంతంగా రంగులు చల్లడం,నీటి బెలూన్లు విసరడం వంటి చర్యలు చేయరాదని హెచ్చరించారు.ప్రార్థనా మందిరాలు,ప్రజా ప్రదేశాలు, రహదారులపై వాహనదారులకు ఆటంకం కలిగించే విధంగా ప్రవర్తించవద్దని తెలిపారు. ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇందుకోసం షీ టీమ్ బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.ప్రధాన కూడళ్లలో మరియు జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిఘా బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.పండుగ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని,జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత వాహనాలను అతివేగంగా నడపకుండా జాగ్రత్తగా ఉండాలని, రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈత రాని వారు చెరువులు, కుంటలు, కాలువల వద్దకు వెళ్లకూడదని,చిన్నపిల్లలను అటువంటి ప్రదేశాలకు తీసుకెళ్లరాదని విజ్ఞప్తి చేశారు. లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. జిల్లా ప్రజలందరూ పరస్పర గౌరవంతో,సురక్షితంగా హోళీ పండుగను జరుపుకొని పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.

## పేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యం

- - ఎమ్మెల్యే కోరం

**టేకులపల్లి,మార్చి02,ప్రజాజ్యోతి:** పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు.టేకులపల్లి మండలం ఎస్.సి కాలనీ ఇందిరమ్మ ఇల్లు లబ్ధివారులు గృహప్రవేశ కార్యక్రమం సోమ వారం నిర్వహించారు.ఘన స్వాగతం పలికిన కుటుంబసభ్యులు... లబ్దిదారులను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన కోరం కనకయ్య.సొంతింటి కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు.అర్హులైన ప్రతీ పేదవాళ్ళకి ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తాం అని అన్నారు.విడతల వారీగా ప్రతీ ఒక్క పేద కుటుంబాన్ని ఆదుకుంటాం అని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లీశ్వరి,నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ ,హౌసింగ్ ఏఈ గణేష్ , మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈది గణేష్, రెడ్యానాయక్, ఆత్మ కమిటీ చైర్మన్ మంగీలాల్, స్థానిక సర్పంచ్ బోడ బాలు నాయక్ , వార్డ్ మెంబర్లు,నాయకులు లక్ష్మయ్య, సంజయ్,మూడ్ గణేష్,శివ,సర్దార్,,బొడ్డు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## యాక్సిడెంట్ పై అనుమానాలున్నాయి

**టేకులపల్లి, మార్చి02, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం లారీ స్కార్పియోను ఢీకొన్న ఘటనలో అనుమానలు ఉన్నాయని స్కార్పియో ఓనర్ బీఆర్ఎస్ మాజీ సర్పంచ్, నాయకులు




భూక్య పాపానాయక్ తెలిపారు. టేకులపల్లి మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్లో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ... టేకులపల్లి మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద తను వాహనంతో ఆగిన క్రమంలో వెనుక నుంచి లారీ తన స్కారియో వాహనాన్ని బలంగా ఢీకొట్టిందన్నారు. స్కార్పియో వాహనంలో నేను నా కుమారుడు భూక్య రాజేష్ వెళ్తున్న క్రమంలో లారీ వేగంగా ఢీకొనడంతో ముందు ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిందని అన్నారు.దీంతో వాహనంలో ఉన్న నాకు స్వల్ప గాయాలైనట్లు తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు ఆయన తెలిపారు. ఈ యాక్సిండెంట్ పై కొందరిపై అనుమానాలు ఉన్నాయని, వారితో భూ తగదాలు ఉన్నట్లు తెలిపారు. టేకులపల్లి పోలిసులు పూర్తి స్థాయిలో విచారణ చేయాలని కోరారు.ఈ ప్రెస్ మీట్ లో సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య రవిరథోడ్ పాల్గొన్నారు.

# రంగుల కేళి..!



**ఇల్లందు, మార్చి 2, ప్రజాజ్యోతి:** రంగుల పండగ రానే వచ్చింది. శిశిరను సాగనంపుతూ వసంతానికి ఆహ్వానించే సందర్భంలో వచ్చే హోలీ వేడుకకు సమయమైంది. ప్రకృతితో అనుబంధం పెనవేసుకున్న రంగుల కేళి హోలీ అడుకోవడానికి చిన్నా.. పెద్దా తేడా లేకుండా సిద్ధమయ్యారు. నూతన నవధాన్యాలతో తయారు చేసిన వంటకాలను మత, మతారాలకు అలంకరిస్తారు. ఊరి పొలిమేర వరకు వాయిద్యాల మధ్య ఊరేగిస్తూ తీసుకెళ్తారు. సంస్కృతి సంప్రదాయ బద్ధంగా భక్తి, శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి దహనం చేస్తారు...

**సంబరాల కేళి.. ఆనందాల హోలీ**

స్నేహితులు, బంధువులు, ఆత్మీయులు, అనురాగాలను పంచుకుంటూ..రంగులను చల్లుకునేందుకు సమాయత్తం అయ్యారు. కాముని పూర్ణిమ మంగళవారం రంగుల మయం కానుంది. పండుగకు అవసరమయ్యే వివిధ రకాల రంగులు చల్లుకుంటారు. కుడుకల పేర్లు, చక్కెర బెండ్లు ఒకరినొకరు పంచుకుంటారు. హోలీ అనేది రంగుల పండగ. హిందువుల వసంత కాలంలో వచ్చే ఈపండుగను భారత దేశంలోనే కాకుండా నేపాల్, బంగ్లాదేశ్, ప్రవాస భారతీయులు సైతం జరుపుకుంటారు. పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ లలో ఈ పండుగను దోల్ యాత్ర, బసంత–ఉత్సబ్ అని అంటారు. హోలీ పండుగను బ్రాబ్ ప్రాంతంలో భగవంతుడైన కృష్ణునికి సంబంధిత ప్రదేశాలైన మధుర, బృందావనం, నందగాల్, బర్సానాలలో ఎంతో ఘనంగా జరుపుకుంటారు. దుల్ హేతి, దులంది, దులేంది అని కూడా పిలిచే ముఖ్యమైన రోజు హోలీ ఉత్సవం రోజున ప్రజలు రంగుల పొడిని, రంగు నీళ్లను ఒకరిపై ఒకరు జల్లుకుంటూ సంతోషంగా గడుపుతారు. హోలీ ముందు రోజున హిరణ్యకశ్యుని చెల్లెలైన హోలీక అనే రాక్షసి బొమ్మకు నిప్పంటిస్తుంది. దీనిని హోలీక దాహన్, చోటి హోలీ అని కూడా అంటారు. హిరణ్యకశకుని చెల్లెలు హోలిక అనే రాక్షసి ప్రహ్లాదుడిని మంటలలో వేసినప్పుడు దైవాలీలలతో తప్పించుకుంటాడు. అందుకే భోగి మంటలు అంటిస్తారు. హోళిక ఈ మంటలలో దహనమవుతుంది. కానీ విష్ణువుకు పరమ భక్తుడైన ప్రహ్లాదుడు, అతని అపార భక్తితో ఎలాంటి గాయాలు కాకుండా తప్పించుకుంటాడు. మనరాష్ట్రంలో హోలీకదహన్ ను కామ దహనం అంటారు. ఇది సాధారణంగా శీతాకాలం చివర్లో ఫిబ్రవరి, మార్చి నెలల తదుపరి వారాల్లో వచ్చే చివరి ఫాల్గుణ మాసం పౌర్ణమి రోజున జరుపుకుంటారు. వయసుతో సంబంధం లేకుండా చిన్నా... పెద్దాలందరు ఎంతో సంతోషంగా హోలీ జరుపుకుంటారు. చిన్నారుల కోసం మార్కెట్ లో వారి అభిరుచికి తగ్గట్టుగా పలు బొమ్మ స్ప్రేయర్లు పిల్లలను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. పట్టణానికి చెందిన రంగుల వ్యాపారులు పెద్ద ఎత్తున రంగుల దుకాణాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. హోలీ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని, రసాయన రంగులతో జాగ్రత్తగా ఉండాలని కంటి వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పూర్వం సహృదయంలో గులాల్, పూల రేకులు ఉపయోగించి ప్రకృతి సిద్ధమైన రంగులను వాడే వారు. కానీ నేడు పండుగ స్వరూపం మరచి కృత్రిమ రంగులతో హోలీ జరుపుకుంటున్నారు. ఏది ఏమైనా హోలీ పండుగను సంతోషంగా జరుపుకునేందుకు అంత సిద్ధమయ్యారు.

## వార్డులలో ప్రధాన సమస్యలపై దృష్టి సారించాలి

**ఇల్లందు, మార్చి 2, ప్రజాజ్యోతి:** మున్సిపాలిటి పరిధిలో నెలకొన్న ప్రధాన సమస్యలపై చైర్పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. సోమవారం



స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరితగతిన వార్డులలో ప్రధాన సమస్యలు డ్రైనేజ్, వీధి ధిపాలు, త్రాగు నీరు, విధ్యుత్ స్ధంభాలు వంటి తదితర సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. వార్డులలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు పూర్తి నాణ్యతతో పూర్తిచేశాల చొరవ చూపాలని తెలిపారు. ఇల్లందు పట్టణాన్ని పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దే విధంగా కౌన్సిలర్లు పని చేయాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల చేత కౌన్సిలర్లు త్వరతగతిన పూర్తి చేసేలా చొరవ చూపాలన్నారు. ఇల్లందు పట్టణానికి రూ. 100 కోట్లకు పైగా అభివృద్ధి నిధులు తీసుకువచ్చామని గుర్తు చేశారు. మన ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ఇండిపెండెంట్ గా గెలిచిన కౌన్సిలర్లు కలిసి పని చేసేందుకు మన పార్టీలో చేరారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిన వార్డులలో స్వల్ప ఓట్ల వ్యవధిలో ఓడిపోయామన్నారు. ప్రతి వార్డు పరిశుభ్రం మన లక్ష్యమని, చైర్మన్ ప్రతి అంశాన్ని నోట్ చేసుకొని ప్రతి సమస్యను కౌన్సిల్ లో అధికారులతో సమీక్ష నిర్వహించి పనులు పూర్తి చేసే విధంగా పనిచేయాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలనను కొనసాగించాలని కోరారు. వార్డులలో ప్రతి కౌన్సిలర్ పనితీరును స్వయంగా తెలుసుకుంటానని పేర్కొన్నారు. రంజాన్ మాసం అయినందున మన నూతన పాలకవర్గం అధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేద్దామని, మైనార్టీ పెద్దలతో చర్చించి తేది ఖరారు చేసి చేద్దామన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి మున్సిపాలిటీలో సమీక్ష సమావేశం నిర్వహిద్దామని, సమస్యల పరిష్కారం దిశగా పని చేద్దామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండేల రాజు, మాజీ మున్సిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డ డానియల్, కౌన్సిలర్లు సైదిమియా, అజ్మీర వంశీ, చిల్లా విజయ భారతి, గొపగాని రాజు, గందె పద్మ, మెరుగు కార్తీక్, నీరుడు ఉపేంద్ర, ఉల్లింగ విజయలక్ష్మీ, యండి జాఫర్, నీలాపు రమేష్, కొర్లపాటి శివ కిరణ్, చెనిగరపు శృతి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ళ సూర్యం, నాయకులు గందె సదానందం, సుదర్శన్ కోరి, కమలమ్మ, యండి మునావర్, కమల్ కోరి, రేఖ రవి శంకర్, ఈశ్వర్, జాన్సన్, రమేష్, ఉల్లింగ సతీష్, జాని మియా తదితరులు పాల్గోన్నారు.

## గల్ఫ్ ఉద్రిక్తతలతో ఆందోళన

(మొదటి పేజీ తరువాయి...)

ఉన్నత హోదాల్లో పనిచేస్తుండగా, మరికొందరు సాధారణ కార్మికులుగా ఉపాధి పొందుతున్నారు. అక్కడ సంపాదించిన ఆదాయంతో ఇక్కడ కుటుంబాలను పోషిస్తున్నారు.వేలాది కుటుంబాల జీవనాధారం గల్ఫ్ దేశాలపైనే ఆధారపడి ఉందని చెప్పడం అతిశయోక్తి కాదు. ఇటీవలి ఉద్రిక్త పరిణామాల నేపథ్యంలో పలు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొనడం, దాడులు, ప్రతిదాడుల వార్తలు వెలువడడం ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న వారిలోనే కాకుండా జిల్లాలోని వారి కుటుంబాల్లోనూ ఆందోళనను పెంచుతోంది. కొందరు తమ బంధువులతో తరచూ ఫోన్ ద్వారా సంప్రదిస్తూ యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు.



**విమాన రాకపోకల నిలిపివేతతో భయం**

ఉద్రిక్త పరిస్థితుల కారణంగా పలు అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దు కావడం, మరికొన్నింటి షెడ్యూల్ మార్పులు చోటుచేసుకోవడం జిల్లాలోని కుటుంబాలకు మరింత కలవరాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా రంజాన్ సందర్భంగా స్వగ్రామాలకు రావాలని భావించిన పలువురి ప్రయాణాలు అనిశ్చితిలో పడిపోయాయి. పరిస్థితులు ఎటువైపు దారి తీస్తాయోనన్న భయం వ్యక్తమవుతోంది.

**1990–91 గల్ఫ్ యుద్ధం జ్ఞాపకం**

ప్రస్తుత పరిస్థితులు 1990–91లో జరిగిన గల్ఫ్ యుద్ధాన్ని ప్రజలకు గుర్తు చేస్తున్నాయి. ఆ సమయంలో గల్ఫ్ దేశాల్లో పనిచేసిన అనేక మంది భారతీయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ అనుభవాలు ఇప్పటికీ ప్రజల మదిలో నిలిచివున్నాయి. మళ్లీ అలాంటి పరిస్థితులు తలెత్తకూడదని కుటుంబాలు ఆకాంక్షిస్తున్నాయి.

**ప్రభుత్వాల భరోసా**

ప్రస్తుత పరిణామాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉన్నట్లు సమాచారం. గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయులు అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని, భారత దౌత్య కార్యాలయాలతో సంప్రదింపులో ఉండాలని సూచిస్తున్నాయి. అపోహలకు లోనుకాకుండా సంయమనంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నాయి.

**జిల్లా ప్రజల్లో పెరుగుతున్న కలత**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అనేక మండలాల నుంచి గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన వారి సంఖ్య గణనీయంగా ఉంది. అక్కడి పరిస్థితులపై స్పష్టత లేకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. యుద్ధ మేఘాలు తొలగి, విమాన రాకపోకలు పునఃప్రారంభమై, సాధారణ పరిస్థితులు నెలకొనాలని జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**పాల్వంచ, మార్చి 2 ప్రజా జ్యోతి** ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరితగతిన వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనలతో కలిసి కలెక్టర్ ప్రజల వినతులను స్వయంగా స్వీకరించారు.జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా సమర్పించగా, వాటిని విన్న కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి, తక్షణ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని దరఖాస్తులు క్రింది విధంగా ఉన్నాయి:భద్రాచలానికి చెందిన శేషగిరి రావు తనకు గతంలో 57%గా జారీ చేసిన సదరం సర్టిఫికెట్‌ను ప్రస్తుతం 2% తగ్గించారని, మళ్లీ 57% ప్రకారంగా సర్టిఫికెట్ మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించగా దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డి.ఆర్.డీ.ఏ) అధికారులకు ఎండార్స్ చేశారు.అశ్వారావుపేట మండలానికి చెందిన ఊకే అరుణకుమారి తన తల్లి కె.ఆదిలక్ష్మి (లేట్),భర్త నాగేశ్వరరావు (లేట్) వారసురాలిగా 2 కుంటల పోడు వ్యవసాయ భూమికి పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలని కోరారు. ఈ విషయంపై తనకు మెమో జారీ అయి రైతుబంధు ప్రయోజనం కూడా లభించిందని, అయితే స్థానిక బ్యాంకు క్రాప్ లోన్ మంజూరుకు ఆర్.ఓ.ఎఫ్.ఆర్ పట్టాదారు పాస్ పుస్తకం అవసరమని తెలియజేసిందని పేర్కొన్నారు. దీనిపై తగు పరిశీలన చేసి క్రాప్ లోన్ మంజూరు చేయుటకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి కలెక్టర్ ఎండార్స్ చేశారు.పాల్వంచ మండలం హమాలి కాలనీకి చెందిన మూడ్ శ్రీనివాస్ తాను పుట్టుకతోనే 89% అంగవైకల్యంతో బాధపడుతున్నానని, తన భార్య ఆరోగ్య పరిస్థితి కూడా బాగోలేదని, కుటుంబ పోషణ కష్టసాధ్యంగా మారిందని, జీవనోపాధి అవకాశాన్ని కల్పించగలరని కోరారు. దీనిపై తగు చర్యల నిమిత్తం జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేశారు.చర్ల మండలానికి చెందిన తడికల నాగరాజు తన కుమార్తె వివాహానికి కళ్యాణ లక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసుకోగా తిరస్కరించబడిందని, పునఃపరిశీలించి మంజూరు చేయాలని కోరు తూ వినతి సమర్పించారు. ఈ దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం భద్రాచలం సబ్ కలెక్టర్‌కు ఎండార్స్ చేశారు.అదేవిధంగాభద్రాచలం జగదీష్ కాలనీకి చెందిన పుప్పాల రమేష్‌తాను నిరుపేద దివ్యాంగుడినని, ఇంటర్మీడియట్ వరకు విద్యాభ్యాసం పూర్తి చేశానని, స్వయం ఉపాధి కోసం దివ్యాంగుల స్కూటీ మంజూరు చేయాలని వినతి సమర్పించారు.దీనిపై తగు చర్యల నిమిత్తం దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులకు ఎండార్స్ చేశా రు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ కృష్ణ భగవానుని స్వామి కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే



**ఇల్లందు, మార్చి 2, ప్రజాజ్యోతి:** మండలంలోని నాయకులగూడెం, కొమరారం గ్రామాలలో సోమవారం జరిగిన శ్రీశ్రీశ్రీ రుక్మిణి సమేత సంతాన వేణుగోపాలస్వామి, శ్రీ రుక్మిణి సత్యభామ శ్రీ క్రృష్ణభగవానుని స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరయ్యారు. కళ్యాణ మహోత్సవంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ వైస్ ఎంపిపి మండల రాము, కొమ్ముగూడెం సర్పంచ్ తాటి యశోద రాంబాబు, నాయకులు కున్సోత్ రాము, కిన్నెర నర్సయ్య, దండుగుల శివ, తారాచంద్ తదితరులు పాల్గొన్నారు.

# కన్నులపండుగగా శ్రీసంతాన వేణు గోపాలస్వామి తిరుకల్యాణం



**బూర్గంపహాడ్, మార్చి 28 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండల పరిధిలోని ఇరవెండి గ్రామంలో గోదావరి నదీతీరాన కొలువైన శ్రీశ్రీశ్రీ సంతాన వేణుగోపాలస్వామి తిరుకల్యాణం సోమవారం కన్నులపండుగగా జరిగింది. వేద పండితులు, అర్చకుల మంత్రోచ్చరణలు, మేళతాళాలు, భాజాభజంత్రీల నడుమ అభిజిత్ లగ్నంలో ఉదయం 12.06 గంటలకు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. తాళ్లూరి జయశేఖర్–నీలిమ దంపతుల సౌజన్యంతో నిర్వహించిన ఈ కల్యాణంలో తాళ్లూరి ట్రస్టు చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్యతో పాటు ట్రస్టు డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ–విజయ రేణుక దంపతులు, తాళ్లూరి కుటుంబ సభ్యులు పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించగా అర్చకులు వైభవంగా ఈ కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామి వారికి తాళ్లూరి కుటుంబీకులు ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణానికి వచ్చిన భక్తులకు భారీగా అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, సర్పంచ్, ఉపసర్పంచ్‌లు గుండే బాబూరావు, మహంకాళి రామారావు, మాజీ సర్పంచ్ కొర్రాస లక్ష్మి, తాళ్లూరి రాధాకృష్ణ, తాళ్లూరి రమేష్, మదపాటి ప్రకాష్, మోహనరావు, తాళ్లూరి జగన్నాధరావులతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

# 'పది' విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు పంపిణీ




**బూర్గంపహాడ్, మార్చి 2 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని సారపాక ప్రగతి విద్యానికేతన్‌లో 2001–2002 పదవతరగతి చదివిన పూర్వ విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సమయం కావడంతో సోమవారం పరీక్షా ప్యాడ్లు, కంపాస్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన పదవతరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థులు తమ వంతుగా రూ.20వేలు వరకు ఫీజు చెల్లిస్తామని తెలిపారు. అంతేకాకుండా భవిష్యత్‌లో పూర్వ విద్యార్థులందరం పాఠశాలలో చదివే విద్యార్థుల సౌకర్యార్థం సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న, డైరెక్టర్ సానికొమ్ము చైతన్యరెడ్డి (చైతన్య), హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు స్వర్ణలత, పూర్వ విద్యార్థులు శ్రీనివాసరెడ్డి, అక్షర్, రాజా తదితరులు పాల్గొన్నారు.

# సిఈఆర్ క్లబ్ లోని జిమ్‌ను పరిశీలించిన సీనియర్ పీఓ



**ఇల్లందు టౌన్, మార్చి 2, ప్రజా జ్యోతి:** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని సిఈఆర్ క్లబ్ లో గల జిమ్ ను సోమవారం సీనియర్ పర్సనల్ ఆఫీసర్ వి అజయ్ సందర్శించారు. జిమ్‌లోని సదుపాయాలు, పరికరాల స్థితిగతులను పరిశీలించారు. అక్కడ ఉన్న ఉద్యోగులు, సభ్యులతో మాట్లాడి జిమ్‌లో వ్యాయామం చేసే విధానం, నిర్వహణ పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిమ్‌ను క్రమబద్ధంగా నిర్వహిస్తూ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగుల శారీరక ఆరోగ్యం మెరుగుపడేందుకు జిమ్ సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

# 16వ వార్డులో పర్యటించిన మున్సిపల్ చైర్ పర్సన్



**ఇల్లందు, మార్చి 2, ప్రజాజ్యోతి:** ఇల్లందు మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో కౌన్సిలర్ ఉల్లింగ విజయలక్ష్మి సతీష్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ పర్యటించారు. ఈ సందర్భంగా నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. అనంతరం వార్డులోని డ్రైనేజ్, వీధిలైట్లు, రహదారుల పరిస్థితిని సమగ్రంగా కలియ తిరుగుతూ తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందని వివరించారు. వార్డులలో పారిశుద్ధ్యం లోపాలు, డ్రైనేజ్ సమస్యలు, వీధి లైట్లు పనిచేయకపోవడం, తాగునీటి కొరత, రోడ్ల మరమ్మతుల వంటి అంశాలపై అధికారులతో చర్చించి తక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్య సహకారంతోఇల్లందు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు నిరంతరం కృషి చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పెండేల రాజు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డ డానియల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జివి భద్రం, పెండెల హరికృష్ణ, లూయిస్ సుఖాంత మిత్ర, నామవరపు సంతోష్, మంచాల ఉదయ్, ప్రసన్న, ఏర్పుల సంతోష్, చంటి, ఊట్ల దినాకర్, రాజేష్, దళిత రత్న మేకల శ్యామ్ మాదిగ, కమల్, మున్సిపల్ సిబ్బంది మహేష్, నాగేందర్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# ముత్తారపుకట్ట విద్యార్థుల ప్రతిభ

**ఇల్లందు, మార్చి 2, ప్రజాజ్యోతి:** ఇల్లందు జిపిఎస్, జెబిఎస్ పాఠశాలలో జిహెచ్‌ఎస్, జెబిఎస్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించిన ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి (ఎఫ్ఎల్ఎన్), లైబ్రరీ కథల పోటీలలో యంపిపిఎస్ ముత్తారపుకట్ట విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రథమ ద్వితీయ బహుతుల సాధించిన విద్యార్థులను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు యం . రాజేంద్రప్రసాద్, పూర్వ కాంప్లెక్స్ హెచ్ యం కె. లలిత, ముత్తారపుకట్ట ఉపాధ్యాయులు కబ్బాకుల రవి, అరెం రవి కుమార్, ఇతర ఉపాధ్యాయులు సోమవారం ముత్తరపుకట్ట విద్యార్థులను అభినందించారు. 1వ తరగతిలో చింత దర్శన్ మొదటి బహుమతి, 2వ తరగతిలో ఊకె నమశ్విత మొదటి బహుమతి, 3వ తరగతిలో చింత తనుశ్రీ మొదటి బహుమతి, 5వ తరగతిలో కల్తీ సుశాంత్ ద్వితీయ బహుమతి సాధించారు. కాంప్లెక్స్ స్థాయి లైబ్రరీ కథల పోటీలలో 1వ తరగతిలో కిన్నెర రిషి వర్ధన్ మొదటి బహుమతి, 2వ తరగతిలో ఈసం హిమా ద్వితీయ బహుమతి, 3వ తరగతిలో కల్తీ అక్షిత మొదటి బహుమతి, 4వ తరగతిలో మడుపు వివేక్ ద్వితీయ బహుమతి సాధించారు.



## బెల్టుషాపులు నియంత్రించాలని వినతి




**బూర్గంపహాడ్, మార్చి 2 (ప్రజా జ్యోతి):**బూర్గంపహాడ్ మండలంలో బెల్టుషాపులు నియంత్రించాలని బీజేపీ జిల్లా నాయకులు చుక్కపల్లి బాలాజీ సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. గుడి,బడి తేడా లేకుండా కిరాణా,టీ దుకాణం, హోటళ్లు ఎక్కడపడితే అక్కడ ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారని, వీటి వల్ల బడికి వెళ్లే విద్యార్థులు సైతం చెడుమార్గం పట్టే అవకాశం ఉందని ఆ వినతిలో పేర్కొన్నారు. అంతేకాకుండా ఓ పక్క వైన్‌షాపుల్లో ఎంఆర్పీకే మద్యం విక్రయిస్తుంటే బెల్టు దుకాణాల్లో మాత్రం ఎమ్మార్పీకి మించి అదనంగా వసూలు చేస్తూ మందుబాబుల జేబులు గుల్ల చేస్తున్నారని,మండలంలో ఎక్సైజ్ అధికారులు బెల్టు దుకాణాలను నియంత్రించడంతో పాటు వైన్‌షాపుల నుంచి బెల్టుషాపులకు అక్రమమార్గంలో మద్యం ఇవ్వకుండా చూడాలన్నారు.

## ముత్తంగి అలంకారంలో దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య

- 333 వెండి లక్ష్మీ రూపులను దేవస్థానానికి అందజేసిన భక్తులు
- నేడు చంద్రగ్రహణం సందర్భంగా రామాలయం మూసివేత







**భద్రాచలం కల్చరల్ , మార్చి 2,ప్రజాజ్యోతి :**భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారు సోమవారం సందర్భంగా ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారి దర్శనం పొందారు. నిత్యకల్యాణ మండపంలో స్వామివారి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్ర–బెల్లం, మాంగల్యధారణ, వేదాశీర్వచనం వంటి కార్యక్రమాలను వైదిక బృందం శాస్త్రోక్తంగా నిర్వహించింది.ఇదే సందర్భంలో హైదరాబాద్‌కు చెందిన పుచ్చ రాజ్యలక్ష్మి–చంద్రశేఖర దంపతులు ఫాల్గుణ పూర్ణిమ సందర్భంగా సాయంత్రం ఆలయంలో నిర్వహించే శ్రీ స్వర్ణలక్ష్మి అమ్మవారి పూజలో పాల్గొనే ఉభయ దాతలకు అందజేయుటకై లక్ష రూపాయల విలువ గల, ఒక్కో గ్రాము బరువున్న 333 వెండి లక్ష్మీ రూపాలను దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్‌కు అందజేశారు.ఇదిలా ఉండగా నేడు చంద్రగ్రహణం సందర్భంగా ఉదయం పూజల అనంతరం ఉదయం 8.30 గంటలకు రామాలయాన్ని మూసివేసి, సాయంత్రం 6.30 గంటలకు తిరిగి తెరవనున్నారు. ఆలయ శుద్ధి, ప్రత్యేక పూజలు, వసంతోత్సవానికి అంకురార్పణ కార్యక్రమాల అనంతరం రాత్రి 8.30 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

# ఇంటర్మీడియట్ పరిక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

- జిల్లా కలెక్టర్ అంకిత్

**పాల్వంచ ,మార్చి 2,ప్రజా జ్యోతి**

జిల్లాలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాల్వంచ పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం పరీక్షా కేంద్రాన్ని, అదేవిధంగా తెలంగాణ సామాజిక సంక్షేమ నివాస పాఠశాల బాలుర విభాగంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సందర్శించి నిర్వహణ తీరును స్వయంగా పరిశీలించారు.పరీక్షలు నిబంధనల మేరకు, ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయా అనే అంశాలను సమగ్రంగా సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల పనితీరు, అభ్యర్థుల హాజరు నమోదు విధానం, ఇన్విజిలేటర్ల విధుల నిర్వహణ, ప్రశ్నపత్రాల రవాణా , భద్రపరచడం వంటి అంశాలపై వివరాలు అడిగి



తెలుసుకున్నారు.విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్షలు రాసేందుకు తగిన డెస్కులు, సరైన లైటింగ్, ఫ్యాన్లు, తాగునీటి సదుపాయం, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రథమ చికిత్స సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా లేవా అని పరిశీలించారు. పరీక్షలు పారదర్శకంగా, క్రమశిక్షణతో నిర్వహించబడుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 37 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు.సోమవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ గణితశాస్త్రం పేపర్–IA, వృక్షశాస్త్రం పేపర్–I రాజకీయ శాస్త్రం పేపర్–I పరీక్షలకు జనరల్ విభాగంలో 8,429 మంది, వృత్తిపర (వొకేషనల్) విభాగంలో 1,860 మంది కలిపి మొత్తం 10,289 మంది అభ్యర్థులకు హాజరు కేటాయించగా, అందులో 9,786 మంది హాజరై, 503 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. పరీక్షల సందర్భంగా ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని స్పష్టం చేశారు.పరీక్షలు పూర్తయ్యే వరకు ఇదే క్రమశిక్షణ, పారదర్శకతతో నిర్వహించాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తదుపరి పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.ఈ తనిఖీ లో సంభధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శాసనసభ సభాపతి పదవికి వన్నెతెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు

- జిల్లా కలెక్టర్ అంకిత్






**పాల్వంచ, మార్చి 2,ప్రజా జ్యోతి:**శాసనసభ సభాపతి పదవికి వన్నెతెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు.దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి కార్యక్రమాన్ని సోమవారం ఐడీఓసి కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, శాసనసభ సభాపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని కొనియాడారు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా పనిచేసిన ఆయన ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో విశిష్ట పాత్ర పోషించారని . ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతిని నిర్వహించడం గౌరవకరమైన విషయమని అన్నారు.దుద్దిళ్ల శ్రీపాదరావు 02 మార్చి 1935న జయశంకర్ భూపాలపల్లి జిల్లా ధన్వాడ గ్రామంలో జన్మించారని, స్వగ్రామంలో ప్రాథమిక విద్యను పూర్తిచేసి, మంథనిలో ఉన్నత విద్యను అభ్యసించారని, అనంతరం హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్, బి.ఎస్సి., ఆర్ట్స్, లా విద్యలను అభ్యసించారనీ, విద్యార్థి దశ నుంచే ప్రజా సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని నాయకత్వ లక్షణాలను ప్రదర్శించారన్నారు, తెలంగాణ ప్రాంతానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడైన ఆయన ధన్వాడ గ్రామ సర్పంచ్‌గా పలు మార్లు సేవలందించారన్నారు, 1980_90లలో ప్రారంభంలో మంథని నియోజకవర్గం నుండి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజల విశ్వాసాన్ని పొందారని, అనంతరం ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించి విశిష్ట సేవలందించారనీ అన్నారు, 1999 ఏప్రిల్ 13న కరీంనగర్ జిల్లా అన్నారం గ్రామ సమీపంలో జరిగిన ప్రమాదంలో ఆయన మరణించారని, ప్రజాస్వామ్య పరిరక్షణలో చూపిన అంకితభావం, ప్రజా సేవ పట్ల నిబద్ధత భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కలెక్టర్ అంకిత్ తెలిపారు.ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు రాజ్యసభ స్థానాలలో ఒకటి మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలి

- ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు దేపంగి రమణయ్య



**పాల్వంచ, మార్చి 2 ప్రజా జ్యోతి** త్వరలో జరగబోయే రాజ్యసభ ఎన్నికలలో తెలంగాణ నుండి పార్లమెంట్లో కానీ , రాజ్యసభలో గాని మాదిగ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం ఇవ్వాలని, రెండు రాజ్యసభ స్థానాల్లో ఒకటి మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు దీపంగి రమణయ్య, జిల్లా కన్వీనర్ నల్లగట్ల వెంకన్నలు ప్రభుత్వాన్ని కోరారు, సోమవారం పాల్వంచ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ప్రెస్ మీట్ నిర్వహించడం జరుగుతుందని, మహాజన సోషలిస్ట్ మాదిగ రిజర్వేషన్ పద్మశ్రీ మందకృష్ణమాదిగ తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీలలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ సామాజిక వర్గాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రాజకీయంగా అణచివేచే అని ధోరణి మానుకోవాలని, సీఎం రేవంత్ రెడ్డి తనను రాజకీయంగా ఎం ఆర్ పి ఎస్ మాదిగలేనని చివరకు మాదిగలను రాజకీయంగా అణచివేస్తూ తెలంగాణలో మాలలకు పెద్దపీట వేయటం జరుగుతుందనీ, కాంగ్రెస్ పార్టీకి మాదిగలు మాలలో రెండు కళ్ళ లాంటి వాళ్ళని ఒక కన్నుతో మాలతో మాత్రమే రేవంత్ రెడ్డి అన్ని విషయాలలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున కర్గే మాల మాటను తూచా తప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేయడం చాలా బాధాకరం అని, జాతీయ అధ్యక్షుడిగా ఉండికూడా మాలలకు పెద్ద పేట వేయడం రాజకీయంగా మాదిగలను అణచివేచే ధోరణి మల్లికార్జున్ కర్గే కూడా మానుకోవాలని, జాతీయ అధ్యక్షుడుగా ఎస్సీలలో అన్ని కులాలను సమానంగా చూసే బాధ్యత కూడా మీరే తీసుకోవాలని మాలలకు మద్దతు పలకడం సరైంది కాదని ,ఎమ్మార్పీఎస్ గా మీకు గుర్తు చేస్తూ పార్లమెంటు రాజ్యసభలలో తెలంగాణ నుండి ప్రాతినిధ్యం లేనందున జాతీయ అధ్యక్షులుగా త్వరలో జరగబోయే రెండు రాజ్యసభ స్థానాలు అవసరమైతే మాదిగలకే కేటాయించాలని వారు డిమాండ్ చేశారు, సమావేశంలో ఎం ఆర్ పి ఎస్ జిల్లా కో కన్వీనర వంగూరి రామ్మూర్తి మాదిగ జిల్లా గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి సోమయ్య , ఎం ఎం ఎస్ జిల్లా అధ్యక్షురాలు వేల్పుల రాణి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసంపల్లి కృష్ణ మాదిగ,జిల్లా సీనియర్ నాయకులు నల్లగట్ల తిరుపతయ్య , రావులపల్లి ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

- నెలల తరబడి నిర్వహించని సమావేశాలు?
- స్థానిక అధికారుల తీరు పట్ల సర్వత్ర విమర్శలు?
- గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలతో జరిగే స్ట్రక్చర్ సమావేశాలకు మంగళం?
- కార్మికుల పట్ల కెఓసి పిఓ నోటి దురుసుతో దుర్భషలాడిన వైనం?
- ఆందోళనలో చేపట్టిన కార్మికులు, కార్మిక సంఘాలు
- డిప్యూటీ సీఎం, సీ అండ్ యండి దృష్టికి తీసుకెళ్ళనున్న కార్మిక సంఘాలు
- అధికారుల తీరు పట్ల ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం!
- స్ట్రక్చర్ సమావేశాలు కొనసాగించేనా!
- అధికారుల తీరు మారేనా!
- ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో!




# ఇల్లందు ఏరియా... గుర్తుందా!

**సింగరేణి సంస్థకు పుట్టినిల్లయిన ఇల్లందు ఏరియా ప్రస్తుత అధికారులకు గుర్తుందా అనే అనుమానాలు కార్మికుల్లో ఉన్నాయి. ప్రతినెల యాజమాన్యం గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలతో జరపాల్సిన స్ట్రక్చర్ సమావేశాలకు మంగళం పాడిందని కార్మికులు గుసగుసలాడుకుంటున్నారు. గత 15 నెలల నుండి కేవలం 3 నుండి 4 సార్లు మాత్రమే గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలతో స్ట్రక్చర్ సమావేశం ఏర్పాటు చేసినట్లు పక్కా సమాచారం.**

**ఇల్లందు, ప్రజాజ్యోతి**

సంస్థ నిబంధన ప్రకారం తప్పనిసరిగా ప్రతి నెలలో స్ట్రక్చర్ సమావేశాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆయా గుర్తింపు, ప్రాథమిక సంఘాలు యాజమాన్యంతో కార్మికుల ప్రమోషన్ పాలసీ, క్యాడర్ స్కీమ్, డిప్యూటేషన్, బదిలీలు, విధుల్లో సమస్యలు, నూతన ప్రాజెక్టులు, ఏరియా ఉత్పత్తి, కార్మికుల రక్షణ చర్యలపై చర్చించడం జరుగుతుంది. అదేవిధంగా మైన్ లలోని క్యాంటీన్ లలో నాణ్యమైన ఆహారం అందించేందుకు, కార్మికులకు రేడియం జాకెట్స్, నాణ్యమైన బూట్లు ఇచ్చేలా యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్తుంటారు . కానీ ఇల్లందు ఏరియాలో సుమారుగా కొన్ని నెలల నుండి స్ట్రక్చర్ సమావేశాలు ఏర్పాటు చేయకపోవడంతో స్థానిక అధికారుల తీరు పట్ల కార్మికుల్లో సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా సంస్థ నిబంధన మేరకు స్ట్రక్చర్ సమావేశం నిర్వహించకపోవడం కార్మిక హక్కులను కాలరాయడమేనని పలువురు కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో కార్మిక వాడల్లో నీటి సమస్యలు ఉన్నాయని, వాటిని ఎవరికీ, ఏ అధికారి చెప్పినా పట్టించుకోవడం లేదని, ఇక తమకు వేసవికాలంలో నీటి ఎద్దడి తప్పే పరిస్థితి నెలకొందని కార్మికులు వాపోతున్నారు. ఇల్లందు ఏరియాలో కార్మికుల సమస్యలు అధికారులకు పట్టవా.. తమ సమస్యలను ఏ అధికారికి చెప్పినా తమకు న్యాయం జరిగే అవకాశాలు లేవని కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా కార్మికుల సమస్యలు చెప్పినా కానీ పలువురు అధికారులు పెడ చెవిన పెడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది.



### కేఓసి పిఓ వైఖరిపై అనేక విమర్శలు?

కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి బొగ్గును వెలికి తీసి దేశానికి వెలుగులు నింపేందుకు నిత్యం కృషి చేస్తుంటే కెఓసి పిఓ మాత్రం కార్మికుల పట్ల నోటి దురుసుతోపాటు దుర్భషలాడడం అనేక విమర్శలకు తావిస్తుంది. విధుల్లో ఉన్న ఓ ఓవర్ మెన్ పట్ల పిఓ వ్యవహార శైలిని వ్యతిరేకిస్తూ గత కొన్ని రోజుల క్రితం ఆ అధికారి కార్యాలయం వద్ద కార్మికులు, కార్మిక సంఘాలు ఆందోళన చేపట్టాయి. బొగ్గు లారీలకు టార్ఫన్లు కట్టే విషయంలో సదరు కెఓసి అధికారి నోరు జారినట్లు కార్మికులు పేర్కొంటున్నారు. ఈ అధికారి వ్యవహార శైలి వల్ల అన్ని కార్మిక సంఘాలు ఆందోళన చేయడంతో పాటు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. త్వరలో పలు కార్మిక సంఘాలు డిప్యూటీ సీఎం, సింగరేణి సి అండ్ ఎండి లను కలిసి ఇల్లందు భవిష్యత్తుతో పాటు స్ట్రక్చర్ సమావేశాలు నిర్వహించకపోవడం, కేఓసి పిఓ వ్యవహార శైలిపై చర్యలు తీసుకోవాలని కోరేందుకు సిద్ధమైనట్లు సమాచారం. అదేవిధంగా పూసపల్లి ఓసిని త్వరితగతిన ప్రారంభించాలని, ఇక్కడి కార్మికులను డిప్యూటేషన్ పై బదిలీ చేసిన వారిని ఇల్లందుకు రప్పించాలని, కేఓసి పిట్ 3 ని సింగరేణి సంస్థ ద్వారానే బొగ్గు వెలికితీయాలని కోరేందుకు సిద్ధమైనట్టు తెలుస్తుంది.

### సర్క్యులర్ లో ఒకటి.. ఆచరణలో మరొకటి

గత నెల 14న సింగరేణి సంస్థ ఇల్లందు అధికారులు ఏరియాలో ఖాళీగా ఉన్న బి టైప్ క్వార్టర్స్ కౌన్సిలింగ్ కోసం సర్క్యులర్ జారీ చేయడం జరిగింది. ఆ సర్క్యులర్ లో కేఓసి లో పనిచేస్తున్న వారికి బి టైప్ క్వార్టర్స్ కౌన్సిలింగ్ లో అవకాశం లేదని పొందుపరచడం జరిగింది. కానీ బి టైప్ క్వార్టర్స్ కౌన్సిలింగ్ లో పొందపరిచిన అంశాలను అధికారులు మరిచి కేఓసి లో విధులు నిర్వహిస్తున్న ఓ ప్రధాన కార్మిక సంఘానికి చెందిన నేతకు క్వార్టర్ కేటాయించడం పలు విమర్శలకు దారితీస్తుంది. సర్క్యులర్ లో పేర్కొన్న విధంగా కేఓసీ కార్మికులకు అవకాశం లేదని చెబుతూ, అక్కడే విధులు నిర్వహించే ఓ ప్రధాన కార్మిక సంఘ నేతకు కేటాయించడం ఏమిటని కార్మికులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇలా సాధారణ కార్మికులను ఒక మాదిరిగా ఆ ప్రధాన కార్మిక సంఘ నేతను మరోలా చూస్తూ గుర్తించి క్వార్టర్ ఇవ్వడం ఏమిటనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందరినీ ఒకేలా చూడాల్సిన అధికారులు ఇలా తారతమ్యం చూపడం సరి కాదని కార్మికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి ఇల్లందు ఏరియాలో గత కొన్ని నెలలుగా నిర్వహించని స్ట్రక్చర్ సమావేశాలను కొనసాగించి కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలని, కార్మికుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్న కేఓసి పిఓ పై చర్యలు తీసుకోవాలని, సర్క్యులర్ కు విరుద్ధంగా ఓ ప్రధాన కార్మిక సంఘ నేత కేఓసీలో పనిచేస్తున్నప్పటికీ క్వార్టర్ కేటాయించిన దానిపై చర్యలు తీసుకోవాలని మరల ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కార్మికులు కోరుతున్నారు.

# వైభవంగా అన్నపురెడ్డిపల్లి శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం

- పసుపు కొట్నాలు, తలంబ్రాల కలయికతో భక్తి రసపూరిత వాతావరణం
- ఎదుర్కోలు ఉత్సవంతో ప్రారంభమైన దివ్య కళ్యాణ మహోత్సవం







**అన్నపురెడ్డిపల్లి, మార్చి 2,ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు భక్తి వైభవాలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి పసుపు కొట్నాలు, తలంబ్రాలు కలపే కార్యక్రమం నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తలంబ్రాలు సమర్పించారు. అనంతరం స్వామివారిని గ్రామ వీధుల మీదుగా అట్టహాసంగా ఊరేగింపుగా తీసుకువచ్చి కళ్యాణ మండపానికి చేర్చారు. భక్తుల హర్షధ్వానాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. రాత్రి 9 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించి, అనంతరం శాస్త్రోక్త విధానంలో స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవం ప్రారంభమైంది. వేద మంత్రోచ్చారణల నడుమ వరుడు–వధువు ఆలంకారాలు, కంకణధారణ, జీలకర్ర–బెల్లం, తలంబ్రాల కార్యక్రమం భక్తి భావంతో సాగింది. మంగళసూత్రధారణ, అక్షింతలు, హారతులతో కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. కళ్యాణాన్ని దర్శించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రముఖులు, రాజకీయ నాయకులు విచ్చేసి స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. కార్యక్రమం మొత్తం శాస్త్రసమ్మతంగా నిర్వహించబడింది. ఉత్సవ ప్రాంగణంలో బొమ్మల కొట్లు, తినుబండారాల స్టాళ్లు ఏర్పాటు చేయగా, జెయింట్ వీల్ వంటి వినోద సౌకర్యాలు పిల్లలను ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. ఆలయ ఈవో పాకాల వెంకటరమణ మరియు నూతన ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చక్కగా జరిగాయి. విద్యుత్, రవాణా, ఆర్ & బి, పంచాయతీ, పోలీస్ శాఖల సమన్వయంతో ఉత్సవాలు ఎలాంటి అంతరాయం లేకుండా విజయవంతంగా కొనసాగాయి. మొత్తంగా శ్రీ బాలాజీ స్వామివారి తిరుకళ్యాణ మహోత్సవం భక్తి, భవ్యం, వైభవాల నడుమ అన్నపురెడ్డిపల్లిలో నిర్వహించబడింది.

## అంతరించిపోతున్న జానపద కళలను పరిరక్షించాలి

- కళాకారులకు గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు, ఉద్యోగాలు ఇవ్వాలి
- ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులువేముల కొండలరావు



**పాల్వంచ, మార్చి 2,ప్రజాజ్యోతి**కళాకారుల సమస్యల పరిష్కరించి కళాకారులను రాష్ట్రప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరుతూ సోమవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలోని ఐ డి ఓ సి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో కొండలరావు ఆధ్వర్యంలో పలువురు కళాకారులు జిల్లా కలెక్టర్ అంకిత్ కు వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి వేముల కొండలరావు మాట్లాడుతూ ప్రజల సంస్కృతి, జీవనశైలి దేశ సాంస్కృతిక రంగాన్ని తెలియజేస్తుందని. శ్రమజీవుల జీవితాల నుండి ఉద్భవించిన సజీవ జానపద కళలు మనకు అపారంగా ఉన్నాయని , పౌరాణిక, చారిత్రక పద్య నాటకాలు తెలుగు జాతికి సొంతం అని. జీవిత వాస్తవాలకు ప్రతిబింబాలైన ఆధునిక నాటకాలు గణనీయంగా ఉన్నవి కానీ "అంగట్లో అన్నీ ఉన్నా.... అల్లుడి నోట్లో శని ఉంది" అన్నట్టు కళారంగాన్ని ప్రోత్సహించడంలో పాలకులు తగినంత శ్రద్ధ వహించకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాంస్కృతిక రంగానికి ప్రోత్సాహక చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు కానీ ప్రకటనలతోనే సరిపెట్టుకోకుండా ఆచరణకు నోచుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.వివిధ కళా రంగాలకు చెందిన కళాకారులు అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని.కళాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని.ప్రతి కళాకారుడికి హెల్త్ కార్డులు, బస్ పాసులు ఇవ్వాలని, కళాకారుల పిల్లలకు నాణ్యమైన ఉచిత విద్య అందించాలని.సాంస్కృతిక రంగంలోని కళా ప్రకృతులైన నాటక, జానపద, సాంప్రదాయ, వృత్తి, యక్షగాన, గిరిజన వివిధ కళారూపాలన్నింటినీ కాపాడాలని.సాంస్కృతిక రంగానికి 1000 కోట్లు బడ్జెట్లో కేటాయించాలని. అంతరించిపోతున్న జానపద కళలను పరిరక్షించుటకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు కల్పించాలని.దేవస్థాన ఉత్సవాలలో విధిగా వృత్తి కళాకారులకు ప్రదర్శన అవకాశాలు ఇవ్వాలని. 50 సంవత్సరాలు నిండిన కళాకారులకు నెలకు 6000 రూపాయల పెన్షన్ మంజూరు చేయాలని. కళాకారులకు సబ్సిడీ రుణాలు అందజేయాలని. టీవీ చానల్స్ లో, చలనచిత్రాలలో ప్రచారం అవుతున్న అశ్లీల, అసభ్య, విష సంస్కృతిని అరికట్టాలని. రాష్ట్రంలోని 33 జిల్లాలలో ఉన్న ఆధునిక పద్య నాటకాలు, జానపద, యక్షగాన, గిరిజన, కోలాటం, ఒగ్గు, సింధు, డప్పుదళం, బుర్రకథ, కొమ్ము డోలు, తోలుబొమ్మలాట, గంగిరెద్దులు, కాటిపాపలు, బతుకమ్మలు, బంజారా, పల్లె సుద్దులు, రాజన్న దళం, ముస్లిం వాయిద్య కళాకారులు, జమిడిక, బుర్ర, దింస, గుస్సాడి, కోయ వీటితోపాటు సాంప్రదాయ కలలు, లలిత కళలు అభ్యున్నతికి పాటుపడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు శనిగరపు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కమటం కొమరయ్య, భాషా (జూనియర్ గద్దర్) జిల్లా నాయకులు కె కృష్ణ, డి లక్షి , రాజేశ్వరి, కె రామారావు, పి సంజీవరావు, అల్లి వెంకటేశ్వర్లు, హెచ్ వెంకన్న, ఇ రామారావు, భూక్య బిక్కులాల్, కోట సుందర్ రావు, తాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జడ్.పీ.హెచ్.ఎస్ పట్వారిగూడెంలో కాంప్లెక్స్ స్థాయి ఎఫ్ఎల్ఎన్ బాలమేళా

**దమ్మపేట,మార్చి. 02, (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం ,పట్వారిగూడెం జిల్లా పరిషత్ హై స్కూల్ లో ప్రధానోపాధ్యాయురాలు కె. లక్షి ఆధ్వర్యంలో కాంప్లెక్స్ స్థాయి ఎఫ్ఎల్ఎన్ బాలమేళా సోమవారం నిర్వహించారు. సర్పంచ్ కూరం అర్జున్ రావు, ఏపీపీసీ చైర్మన్ కోటేశ్వరి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 1–5 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు, గణితం విషయాలలో సామర్థ్య ఆధారిత రాత పరీక్షలు, అలాగే గ్రంథాలయ అభ్యసన పండుగలో కథ చెప్పే కార్యక్రమం నిర్వహించారు. ప్రతి తరగతి నుండి ఇద్దరు విద్యార్థులు పాల్గొనగా, మొత్తం 10 మందిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఎంపికైన వారు 06-03-2026న మండల స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.



# డ్రై హోలీ ఆరోగ్యానికి హామీ

- రంగుల సంబరంలో రసాయన ముసుగు
- సహజ వర్ణాలతోనే సంపూర్ణ వసంతం
- నేడే హోళీ పండుగ





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 2, ప్రజాజ్యోతి:**

వసంతం అడుగుపెడితే ప్రకృతి రంగుల హారతులు ఇస్తుంది. ఆ హారతుల్లో మనుషుల నవ్వులు కలిసితే అది హోలీ పండుగగా మారుతుంది. రంగు చల్లిన చేతిలో ప్రేమ ఉండాలి కానీ ప్రమాదం కాదు. ఆనందపు చిలిపి చుక్కల వెనుక ఆరోగ్యపు చీకట్లు దాగకూడదు. మార్చి 3వ తేదీన జరగనున్న హోలీకి గ్రామాలు, పట్టణాలు సిద్ధమవుతున్నాయి. అయితే మార్కెట్లో లభిస్తున్న రంగుల నాణ్యతపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పండుగ ఉత్సాహంలో అప్రమత్తత కోల్పోవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డ్రై హోలీకి ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు.హోలీ కోసం ఉపయోగించే కొన్ని రంగులు తక్కువ ధరలో లభిస్తున్నాయి. అవి రసాయనాలతో తయారవుతున్నాయని సమాచారం. సున్నం, ఇంజిన్ ఆయిల్ వంటి పదార్థాలను కలిపి తయారు చేసే రంగులు ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. ఇవి చర్మంపై పడితే దురద, ఎర్రబారడం, అలర్జీలు వచ్చే అవకాశముంది. కొందరికి గాయాలుగా మారే పరిస్థితులు కూడా ఎదురవుతాయని హెచ్చరిస్తున్నారు. కళ్లలోకి వెళ్లినపుడు తీవ్రమైన మంటతో పాటు చూపు దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. పిల్లలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. తెలియని బ్రాండ్ల రంగులను ఉపయోగించకూడదని స్పష్టం చేస్తున్నారు.


**చర్మం, కళ్లకు కనిపించని ప్రమాదాలు...**

రసాయన రంగుల్లో సీసం, పాదరసం వంటి లోహాలు ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇవి శరీరానికి దీర్ఘకాలిక హానిని కలిగించవచ్చని పేర్కొంటున్నారు. చర్మవ్యాధులు ఉన్నవారికి సమస్యలు మరింత తీవ్రమవుతాయని హెచ్చరిస్తున్నారు. కళ్లలో రంగు పడితే వెంటనే శుభ్రమైన నీటితో కడగాలని సూచిస్తున్నారు. సమస్య కొనసాగితే వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు. హోలీ అనంతరం చర్మ సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని అంటున్నారు. నిర్లక్ష్యం చేస్తే చిన్న సమస్య పెద్దదవుతుందని హెచ్చరిస్తున్నారు.

**సహజ రంగులే సరైన మార్గం...**

పసుపు, కుంకుమ, గులాబీ రేకులు, బీట్‌రూట్ పొడి వంటి సహజ రంగులు సురక్షితమని వైద్యులు సూచిస్తున్నారు. ఇవి చర్మానికి హాని చేయకుండా సులభంగా శుభ్రం అవుతాయని చెబుతున్నారు. హోలీ ఆడే ముందు శరీరానికి కొబ్బరి నూనె రాయడం మంచిదని సూచిస్తున్నారు. కళ్లకు రక్షణగా కళ్లజోడు ధరించడం ఉపయుక్తమని పేర్కొంటున్నారు. చిన్నపిల్లలకు తక్కువ పరిమాణంలోనే రంగులు ఉపయోగించాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పండుగను ఆస్వాదించవచ్చని చెబుతున్నారు. డ్రై హోలీతోనే ఈసారి సురక్షిత సంబరాలు సాధ్యమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**సహజ రంగులతో హోలీ జరుపుకోవాలి**
**డాక్టర్ కృష్ణ ప్రసాద్, ప్రభుత్వ వైద్యులు...**



హోలీ పండుగను సహజ సిద్ధమైన రంగులతో జరుపుకోవాలి. రసాయనాలతో కూడిన రంగులు వాడడం, వాహనాల్లో ఉపయోగించే ఆయిల్ కలిపిన రంగులు చర్మం, కళ్లకు హాని చేసే అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో చూపు కోల్పోయే ప్రమాదంతో పాటు దీర్ఘకాలిక చర్మవ్యాధులు వచ్చే అవకాశం ఉంది. పండుగ సంబరాలు ఆనందాన్ని పంచాలి కానీ విషాదాన్ని కాదు.

## కిన్నెరసాని గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేసిన

- యస్బీఐ రీజనల్ మేనేజర్ యం సత్యనారాయణ



**పాల్వంచ ,మార్చి 2,ప్రజా జ్యోతి** పాల్వంచ మండల పరిధిలోని కిన్నెరసాని లో గల గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల లో పదోవ తరగతి చదివే విద్యార్థులకు సోమవారం కిన్నెరసాని ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్ పి. వెంకటరెడ్డీ ఆర్థిక సహకారంతో పెన్నులు, పరీక్ష ప్యాడ్లు.జ్యామెట్రి బాక్స్ ఉచితంగా పంపిణీ చేశారు, ఈ ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత శిఖరాలను అవరోదించాలని కోరారు, అలాగే బ్యాంకు పరంగా ఉన్నత చదువుల కోసం బ్యాంకు రుణాలు కూడా అందిస్తున్నామని, మీకు కూడా రాబోయే రోజులలో ఇలాంటి సౌకర్యం భవిష్యత్తు లో ఉంటుందనీ ,ఆర్థిక స్తొమత చదువు కు అడ్డు కాకూడనని కోరారు,అలాగే చీఫ్ మేనేజర్ ప్రభాత్ రంజన్ నాయక్ మాట్లాడుతూ చదువు మాత్రమే మన జీవితాలను ప్రభావితం చేయగలదని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు ఉపయోగించుకొని లక్ష్యం సాధించాలని కోరారు,

**సీయస్సార్ కింద పాఠశాల అభివృద్ధికీ నిధులు కేటాయించాలి... రమేష్ రాథోడ్**

సోమవారం కిన్నెరసాని లో జరిగిన ఉచిత ప్యాడ్ల పంపిణీ కార్యక్రమంలో అతిధిగా హాజరైన గ్రీన్ ఎర్త్ సొసైటీ వ్యవస్థాపకులు,పాఠశాల పూర్వ విద్యార్థి రమేష్ రాథోడ్, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి బ్యాంక్ రీజనల్ మేనేజర్ కు సీయస్సార్ క్రింద పాఠశాల అభివృద్ధికు నిధులు కేటాయించాలని కోరారు,ఈ సందర్భంగా పి,వెంకట రెడ్డీ మాట్లాడుతూ తాను వ్యవసాయ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం నుండీ వచ్చానని, మీరు ఎన్ని కష్టాలు ఎదురైనా చదువునీ మాత్రం మధ్యలో ఆపవద్దని, ఉన్నత ఆశయాలతో జీవించాలని ఆకాక్షించారు,,ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు ధరావత్ ఎంకన్న, సుధాకర్, రమేష్, జయసూరి, రవి, నరేష్, విద్యార్థులు తదితరులు పాల్గోన్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే పాయం

- ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్ నీళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం

**పినపాక,మర్చి 02(ప్రజాజ్యోతి ):**పినపాక మండలంలోని ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్ ప్రాంతంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక అడుగు పడింది. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం రూ. 65 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఓవర్ హెడ్ నీళ్ల ట్యాంక్‌కు భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు.ఇటీవల ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్ వర్తక సంఘం సభ్యులు ఎమ్మెల్యేను కలిసి తాగునీటి సమస్యను వివరించారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఎమ్మెల్యే వెంటనే స్పందించి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో చర్చించి అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. డీఎంఎఫ్టీ నిధులతో రూ. 65 లక్షల అంచనా వ్యయంతో 93 వేల లీటర్ల నిల్వ సామర్థ్యంతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు ఆమోదం పొందాయి.శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, “ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం మా ప్రభుత్వ ధ్యేయం. తాగునీరు ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటాం” అని తెలిపారు. నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న ప్రాంత ప్రజలకు ఈ ట్యాంక్ నిర్మాణం ఉపశమనం కలిగిస్తుందని చెప్పారు.తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినందుకు వర్తక సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీఓ కే. వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ బ్రహ్మదేవ్, మండల సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జి. రామనాథం, సీనియర్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, కొర్సా ఆనంద్, జి. శ్రీనివాస్ రెడ్డి, పేరం వెంకటేశ్వర్లు, దాట్ల రాజేష్, పోలిశెట్టి హరీష్, వి. లక్ష్మి రెడ్డి, అచ్చా నవీన్, నిట్ట వెంకటేశ్వర్లు, సతీష్ చారి, వర్తక సంఘం అధ్యక్షులు సురేష్,తదితరులు పాల్గొన్నారు.



# రంగుల వైభవం.. బాధ్యతతో ఆనందం..

- హోలీ పండుగను సుర క్షితంగా, పర్యావరణ హితంగా జరుపు కుందాం
- సౌభ్రాతృత్వానికి సంకే తమైన హోలీ సంద ర్భంగా ప్రజలకు పిలుపు
- ప్రజాజ్యోతి దమ్మపేట మండల రిపోర్టర్ బెల్లం కొండ రామారావు



**దమ్మపేట,మార్చి.02, (ప్రజాజ్యోతి):** భారతదేశంలో అత్యంత ఉత్సాహభరితంగా జరుపుకునే హోలీ పండుగ ఆనందం, ఐక్యత, స్నేహభావాలకు ప్రతీకగా నిలుస్తుంది. చెడుపై మంచికి విజయాన్ని సూచించే ఈ పర్వదినం మన సంస్కృతిలో విశిష్ట స్థానాన్ని సంపాదించింది. హోలికా దహనం ద్వారా అధర్మం నశించి ధర్మం విజయం సాధించిన సందేశాన్ని స్మరించుకుంటూ, తదుపరి రోజు రంగుల హోలీ ఆడుతూ ప్రజలు పరస్పర స్నేహాన్ని బలపరుచుకుంటారు. గ్రామాలు, పట్టణాలు, నగరాలు రంగుల కాంతులతో కళకళలాడుతూ పండుగ వాతావరణాన్ని సృష్టిస్తాయి. హోలీ కేవలం రంగుల పండుగ మాత్రమే కాదు; అది మనసులను కలిపే మహోత్సవం. భిన్న వర్గాలు, మతాలు, సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు కలిసి జరుపుకునే ఈ వేడుక సమాజంలో సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తుంది. విభేదాలను మరచి ప్రేమ, క్షమాభిక్ష, అనురాగాలతో కొత్త ఆరంభాలకు నాంది పలికే సందేశాన్ని ఈ పండుగ అందిస్తుంది. అయితే పండుగ ఆనందం సురక్షితంగా, బాధ్యతతో కొనసాగాలంటే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. రసాయనాల మిశ్రమంతో తయారైన హానికర రంగులు చర్మానికి, కళ్లకు హాని కలిగించవచ్చు. కాబట్టి సహజసిద్ధమైన, హెర్బల్ లేదా ఆర్గానిక్ రంగులను మాత్రమే వినియోగించడం మంచిది. పసుపు, కుంకుమ, బీట్‌రూట్, గులాబీ రేకులు, పూల పొడి వంటి ప్రకృతి పదార్థాలతో తయారైన రంగులు ఆరోగ్యానికి హానికరం కావు. తెలియని బ్రాండ్‌ల రసాయన రంగులను కొనుగోలు చేయకుండా, నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే ఉపయోగించాలి. నీటి వృథాను నివారించాలి. అవసరానికి మించి నీటిని ఉపయోగించడం వల్ల పర్యావరణానికి నష్టం కలుగుతుంది. డ్రై హోలీని ప్రోత్సహించడం ద్వారా నీటి సంరక్షణకు తోడ్పడాలి. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా బలవంతంగా రంగులు వేయకూడదు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు మరియు అనారోగ్యంతో ఉన్నవారిపై జాగ్రత్తగా వ్యవహరించాలి. కళ్లలోకి రంగులు పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి; అవసరమైతే గాగుల్స్ ఉపయోగించడం మంచిది. వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలి. ప్రజలందరూ శాంతి, సౌహార్ద వాతావరణంలో హోలీని జరుపుకోవాలని, ఎలాంటి అసాంఘిక చర్యలకు తావివ్వకూడదని విజ్ఞప్తి చేస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడుతూ, ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ, పరస్పర గౌరవంతో పండుగను జరుపుకుంటే హోలీ నిజమైన అర్థాన్ని సార్థకం చేస్తుంది. ఈ రంగుల పండుగ ప్రతి ఇంటా సుఖ శాంతులు, ఐశ్వర్యం, విజయాలు తీసుకురావాలని, ప్రతి హృదయంలో ఆనందం నింపాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికీ హృదయపూర్వక హోలీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

### సబ్ ఇన్స్పెక్టర్ సాయి కిశోర్ రెడ్డి సందేశం

స్థానిక పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ సాయి కిశోర్ రెడ్డి మాట్లాడుతూ హోలీ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బలవంతంగా రంగులు వేయడం, అసభ్య ప్రవర్తన చేయడం, రోడ్లపై ప్రమాదకరంగా వాహనాలు నడపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి అనుచిత ఘటనలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ విభాగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉంటుందని వెల్లడించారు.

## మంగళతండలో 25 కేవి ట్రాన్స్ ఫార్మర్ కాపర్ వైర్ చోరీ



**టేకులపల్లి, మార్చి 02,ప్రజాజ్యోతి:** మండలంలోని మంగళ్ తండా సమీపంలో గలచేనులో 25 కె.వి ట్రాన్స్ఫర్మర్ కాపర్ వైర్ ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. గ్రామ సమీపచేనులో 25 కె.వి ట్రాన్స్ ఫార్మర్ ఉంది. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్ ఫార్మర్ను పగులగొట్టి అందులోని కాపర్ వైర్న చోరీ చేశారు. ఈ ఘటనపై టేకులపల్లి ఏఈ హాట్కర్ దేవా టేకులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాపర్ వైర్ దుండగులను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు. గడిచిన నెల రోజుల క్రితం సైతం మండలంలోని పెట్రాంచెలక సమీపంలో గల 25 కె.వి ట్రాన్స్ ఫార్మర్ కాపర్ వైర్ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ట్రాన్స్ ఫార్మర్లలో కాపర్ వైర్ల వరుస చోరీలతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు.

# జితేష్ వి పాటిల్ సేవలు చిరస్మరణీయం

- ప్రజల మనసుల్లో నిలిచిన అధికారికి ఘన వీడ్కోలు
- నూతన కలెక్టర్ శ్రీ అంకిత్ కు స్వాగతం తెలిపిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ





**దమ్మపేట,మార్చి.02, (ప్రజాజ్యోతి):** అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ జారె ఆదినారాయణ జిల్లాకేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొని ఇటీవల బదిలీ అయిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సేవలను కొనియాడారు. ఆయన పదవీకాలంలో జిల్లా అభివృద్ధికి దిశానిర్దేశం చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో సంక్షేమ పథకాల సమర్థ అమలుకు కృషి చేశారని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరించారని, నిబద్ధతతో పనిచేసే ప్రజాహితశీలి అధికారిగా ప్రత్యేక గుర్తింపు పొందారని ప్రశంసించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాల్లో సేవలందించాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా, నూతన జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ అంకిత్ కు జిల్లాప్రజల తరఫున స్వాగతం తెలియజేశారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమర్థ అమలులో ప్రజాప్రతినిధులు–అధికారులు సమన్వయంతో పనిచేస్తే మరింత మంచి ఫలితాలు సాధ్యమవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించిన సర్పంచ్



**టేకులపల్లి,మార్చి 02,ప్రజాజ్యోతి:** మండల పరిధిలోని ఎ. కాలనీ తండలో జిపిఎస్ ప్రాథమిక పాఠశాల సోమవారం టేకులపల్లి గ్రామ సర్పంచ్ బోడ బాలు మధ్యాహ్న భోజన్నా నీ పరిశీలించి,విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారి విద్యాభ్యాసం,హాజరు, పాఠశాలలో అందుతున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి,పాఠశాలలో భోజనం నాణ్యత,పరిశుభ్రత, వంటశాల నిర్వహణపై ఆరా తీశారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండి మంచి చదువు సాధించాలని ఆకాంక్షిస్తూ ఉపాధ్యాయులను అభినందించారు. గ్రామ పాఠశాల అభివృద్ధికి తగిన సహకారం అందిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు.

## బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీ

- పివిఆర్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం



**అన్నపురెడ్డిపల్లి, మార్చి 2, ప్రజాజ్యోతి:** అన్నపురెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని పివిఆర్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ జిల్లా నాయకులు పరసా వెంకట్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 12 గంటలకు ఏర్పాటు చేశారు. తీవ్ర ఎండలు ఉండటంతో బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన భక్తులకు చల్లని మజ్జిగను పంపిణీ చేసి దాహం తీర్చే విధంగా సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ నిర్వాహకులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పూర్ణచంద్రరావు, బాలస్వామి, శ్రీను, వేముల రమణ, ఆలయ చైర్మన్ పాకాల వెంకటరమణ, శివాలయం చైర్మన్ మల్లెల నరసింహారావు, మాజీ సర్పంచ్ బోడా పద్మ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే భక్తులు పెద్ద ఎత్తున హాజరై సేవా కార్యక్రమానికి సహకరించారు. భక్తులకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం అందరి ప్రశంసలు పొందింది.

## 108 లో సుఖ ప్రసవం



**టేకులపల్లి,మార్చి02,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం చింతోని చేలక గ్రామం పెద్ద తండా కి చెందిన సునావత్ చిన్ని (21) పురిటి నొప్పులు తో బాధపడుతుండగా భర్త 108 కు సమాచారం అందించారు. 108 చేరుకొని గర్భిణిని కొత్తగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించే క్రమంలో మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటి సునీత సాయంతో మార్గ మధ్యలోనే సుఖ ప్రసవం జరిపించగా ఆడ బిడ్డ జన్మించింది.తర్వాత రామవరం మాత శిశు సంరక్షణ కేంద్రానికి తీసుకొని వెళ్లారు .తల్లి బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉండడంతో మార్గమధ్యంలో సుఖ ప్రసవం జరిపించిన ఈఎంటి సునీత , పైలెట్ దేవాకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## తహసీల్దారు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహణ




**భద్రాచలం, మార్చి 2 ,ప్రజాజ్యోతి :**భద్రాచలం తాసిల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంను సోమవారం తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో భద్రాచలం రెవెన్యూ పరిధిలోని ప్రజలు వివిధ సమస్యల కొరకు దరఖాస్తులు చేసుకున్నారని, ఇందులో ముఖ్యంగా గ్రామ పంచాయతీ, ఎలక్ట్రికల్, రెవిన్యూ శాఖ మరియు ఇందిరమ్మ ఇండ్లకు సంబందించిన అర్జీలు వచ్చాయని ఆయన తెలిపారు. వాటిని పరిశీలించి వీలైనంత తొందరగా సమస్యలు పరిస్కారం కొరకు ఆయా శాఖలకు పంపించడం జరిగిందన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కారం చేయడం జరిగిందని, ప్రజలు పెట్టుకున్న అర్జీలు పరిస్కారం దిశగా విచారణ జరిపి దరఖాస్తుదారినికి న్యాయం జరిగేలా చూస్తామని ఆయన అన్నారు. ఇకనుండి ప్రజావాణి కార్యక్రమం ప్రతి సోమవారం నిర్వహించడం జరుగుతుందని, ప్రభుత్వ శాఖలలో ఏవైనా సమస్యలు ఉంటే మధ్య దళారులను ఎవరిని నమ్మకుండా నేరుగా ప్రజావాణి ద్వారా పరిష్కరించుకోవాలని, మండల స్తాయి అధికారులు ప్రజావాణి యందు అందుబాటులో ఉంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్, విద్యుత్ శాఖ మరియు ఐకెపి, వైద్య శాఖ, ఎంపీడీవో కార్యాలయంనకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల సమస్యలు పరిష్కరించేందుకు యూనిట్ అధికారులు చొరవ చూపాలి

- ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అశోక్



**భద్రాచలం, మార్చి 2,ప్రజాజ్యోతి :**మారుమూల గిరిజన గ్రామాల నుండి వివిధ సమస్యల ల పరిష్కారానికి గిరిజన దర్బార్ లో అర్జీలు సమర్పించడానికి వచ్చే గిరిజనుల యొక్క దరఖాస్తులను పరిశీలించి వారి సమస్యల పరిష్కరించేలా సంబంధిత యూనిట్ అధికారులు చొరవ చూపాలని ఐటీడీఏ డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన గిరిజన దర్బార్లో వివిధ ఆదివాసి గిరిజన గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించి, సంబంధిత అధికారులకు పంపుతూ ప్రతి దరఖాస్తుదారుని యొక్క సమస్యలు పరిష్కరించే విధంగా సంబంధిత యూనిట్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన అన్నారు.ఎక్కువ శాతం దరఖాస్తులు పోడు భూముల సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, ఎంఎస్ఎంఏ ద్వారా అందించే సబ్సిడీ రుణాల కొరకు, కొత్తగా ఏర్పాటు చేసే మత్స్యకార సొసైటీల అనుమతి కొరకు, వ్యవసాయానికి వచ్చాయన్నారు. గిరిజన దర్బార్ లో వచ్చిన దరఖాస్తులను ఆన్లైన్లో ద్వారా ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేసి, అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు విడతల సమస్యలు పరిష్కరించడానికి చర్యలు చేపడుతున్నట్లు ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఏవో సున్నం రాంబాబు, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్,ఏపీఓ పవర్ వేణు, ఆర్ సి ఓ గురుకులం అరుణకుమారి, డి టి ఆర్ ఓ ఎఫ్ ఆర్ లక్ష్మీ నారాయణ, కొండరెడ్ల విభాగం అధికారి గన్య, ఎఫ్ డి సి ఉదయ్ కుమ మిషన్ మామ్ భగీరథ ఏఈఈ నారాయణ రావు, డిఎస్ఓ ప్రభాకర్ రావు, జేడీఎం హరి కృష్ణ, వివిధ విభాగాలకు చెందిన భార్గవి, వెంకటేశ్వరరావు, ముత్తయ్య, మోహన్,ఐసిడిఎస్ సూపర్వైజర్ అనసూయ తదితరులు పాల్గొన్నారు.

# లింగాలపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ





**దమ్మపేట,మార్చి. 02, (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం,లింగాలపల్లి ప్రభుత్వ పాఠశాలను అశ్వరావుపేట నియోజక వర్గ ఎమ్మెల్యే శ్రీ జారె ఆది నారాయణ అకస్మాత్తుగా సందర్శించారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా పాఠశాలకు చేరుకున్న ఆయన నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లి బోధన విధానాన్ని పరిశీలించారు.విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారు చదువుతున్న తరగతులు, భవిష్యత్ లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. కొందరిని పాఠాలు చదివించగా, మరికొందరిని ప్రశ్నలు అడిగి వారి అవగాహన స్థాయిని పరిశీలించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో సమాధానాలు ఇవ్వడం పట్ల ఆయన అభినందించారు.ఈ పాఠశాలలో ఎమ్మెల్యే శ్రీమతి వరలక్ష్మి ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నప్పటికీ, ఎలాంటి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వకుండా సాధారణ తనిఖీ నిర్వహించడం ప్రత్యేకంగా నిలిచింది.తరువాత ఉపాధ్యాయులతో సమావేశమై బోధన ప్రమాణాలు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతులు మరియు పాఠశాల అభివృద్ధి అంశాలపై చర్చించారు. విద్యా ప్రమాణాల పెంపు కోసం అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## రంగుల పండుగలో రగడలకు తావు లేకుండా జరుపుకుందాం

- సహజ రంగులకే ప్రాధాన్యం
- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు : ఎస్సై విజయసింహారెడ్డి




**అన్నపురెడ్డిపల్లి, మార్చి 2,ప్రజా జ్యోతి:**హోళీ పండుగను ఆనందోత్సాహాల మధ్య పరస్పర గౌరవంతో, శాంతి భద్రతలకు భంగం కలగకుండా నిర్వహించుకోవాలని అన్నపురెడ్డిపల్లి మండల ఎస్సై విజయసింహారెడ్డి మండల ప్రజలకు సూచించారు. పండుగ సందర్భంలో అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.సహజసిద్ధమైన రంగులను మాత్రమే ఉపయోగించాలని, హానికరమైన రసాయనిక రంగులను వాడకూడదని తెలిపారు. బలవంతంగా రంగులు చల్లడం, నీటి బెలూన్లు విసరడం వంటి చర్యలు చేయరాదని హెచ్చరించారు. ప్రార్థనా మందిరాలు, ప్రజా ప్రదేశాలు, రహదారులపై వాహనదారులకు ఆటంకం కలిగించే విధంగా ప్రవర్తించవద్దని స్పష్టం చేశారు.పండుగ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని, మండల వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా చేపట్టనున్నట్లు వెల్లడించారు. యువత అతివేగం ప్రదర్శించకుండా జాగ్రత్తగా వాహనాలు నడపాలని, రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈత రాని వారు చెరువులు, కుంటలు, కాలువల వద్దకు వెళ్లరాదని, చిన్నపిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని విజ్ఞప్తి చేశారు. లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.మండల ప్రజలందరూ శాంతియుతంగా, సురక్షితంగా హోళీ పండుగను జరుపుకుని పోలీసులకు సహకరించాలని ఎస్సై విజయసింహారెడ్డి కోరారు.

## పని ప్రదేశాలలో మహిళలపై జరుగుతున్న దాడులపై చర్చ జరగాలి

- ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు
- సిఐటియు జిల్లా నాయకులు ఎర్రం శెట్టి వెంకట రామారావు



**భద్రాచలం, మార్చి 2 ,ప్రజాజ్యోతి :**కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన లేబర్ కోడ్ల తో పని ప్రదేశాలలో మహిళా కార్మికులకు రక్షణ లేకుండా పోతుందని పని ప్రదేశాలలో మహిళలపై జరుగుతున్న హింసపై విస్తృత చర్చ జరపాలని సిఐటియు జిల్లా నాయకులు ఎర్రం శెట్టి వెంకట్రామారావు అన్నారు. సోమవారం ఐద్వా పట్టణ కార్యదర్శి డి సీతాలక్ష్మి అధ్యక్షతన జరిగిన ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో వెంకట రామారావు మాట్లాడారు. ఈనెల ఆరున ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించాలని కోరారు. ప్రజా సంఘాల ఐక్య వైదిక ఆధ్వర్యంలో నిర్వహించే మహిళా దినోత్సవం వేడుకలలో మోదీ ప్రభుత్వం ఏర్పడ్డాక మహిళలపై జరుగుతున్న దాడులపై చర్చించాలని అన్నారు. మనువాదాన్ని ముందుకు తీసుకువస్తూ మహిళలను వంట గదిలకే పరిమితం చేయాలని మోడీ చూస్తున్నారని అన్నారు. నూతన లేబర్ కోడ్లతో కార్మికుల హక్కుల కోల్పోవడంతో పాటు శ్రామిక మహిళ లకు రక్షణ సైతం లేకుండా పోతుందని అన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొలగని రమేష్ ఐద్వాసిని నాయకురాలు నాదెల లీలావతి జిల్లా కమిటీ సభ్యులు ఎర్రంశెట్టి పూర్ణిమ జీవనజ్యోతి ఉస్తేల జ్యోతి డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి దారిశెట్టి సతీష్ బాబు ఎస్ఎఫ్ఐ కన్వీనర్ రవీంద్ర సిఐటియు నాయకులు సంతోష్ కుమార్ నకిరేకంటి నాగరాజు అజయ్ కుమార్ రాయల రాములు రమ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

## దుదిళ్ళ శ్రీపాదరావు జయంతి వేడుకలు

**కొత్తగూడెం సింగరేణి, మార్చి 2 – ప్రజాజ్యోతి:**సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయము లో స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడకను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ... ఉన్నత విలువలకు, నీతి నిజాయితీలకు ప్రతిరూపంగా మాజీ స్పీకర్ కీర్తిశేషులు దుద్దిళ్ల శ్రీపాదరావు నిలుస్తారని, ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయమని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభకు స్పీకర్ గా వ్యవహరించి అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులతో మంచి పేరు తెచ్చుకున్న వ్యక్తి అని కొనియాడారు. దుద్దిళ్ల శ్రీపాదరావు ఇప్పుడు ఉన్న మంథని శాసనసభ్యులు ఐటీ శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు తండ్రి అని, రాజకీయాల్లో ఉన్నత విలువలకు పట్టం కట్టిన తెలంగాణ ప్రాంత నేతగా ఆయన ప్రజల మనసుల్లో చిరకాలం గుర్తుండిపోతారని, తన రాజకీయ జీవితం మొత్తం ప్రజలకు అంకితం చేసి, ప్రజా సేవకే ప్రథమ ప్రాధాన్యత ఇచ్చారని, ప్రతిపక్షాలు కూడా ఆమోదించి ప్రశంసించిన స్పీకర్ గా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిఎంతో పాటు కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జే. గట్టయ్య, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, అధికారుల సంఘం అధ్యక్షుడు ఎం.వి నరసింహారావు, ఏజిఎం ( ఫైనాన్స్) ఈ.భీభాత్స, ఎజిఎం (పర్సనల్) జి.వి. మోహన్ రావు, జిఎం కార్యాలయంలోని వివిధ విభాగాధిపతులు, ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.